క్లుప్తంగా

సకాలంలో నాడు-నేడు పనుల పూర్తి



నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మనబడి నాడు-నేడు పథకం పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ జె.త్రినాథరావు సూచించారు. మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను మంగళవారం పరిశీలించిన ఆయన పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేయాలని, పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే తప్పవని హెచ్చరించారు.

వీధికుక్కల దాడిలో దివ్యాంగునికి గాయాలు

రేగిడి: మండలంలోని మీసాలడోలపేట గ్రామంలో పాలకొండ సురేష్ అనే దివ్యాంగునిపై మంగళవారం వీధికుక్కలు దాడిచేసి గాయపర్చాయి. సురేష్‌కు రెండు చేతులు లేకపోవడంతో వీధికుక్కలు మీదపడి దాడి చేసినా ప్రతిఘటించలేకపోయాడు. స్థానికులు గమనించి కుక్కలను బెదరగొట్టి, 108కు సమాచారం అందించారు. ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలెట్ గర్భాపు నారాయణరావు గాయాలపాలైన సురేష్‌కు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



చిన్నారుల ఆరోగ్యం తనిఖీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షితారాణి

తెర్లాం: పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షితారాణి సూచించారు. మండలంలోని రాజయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు, చిన్నారులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, ఎండలో ఎవరూ తిరగవద్దని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్‌ఎం వెంకటి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



రేగిడిలో స్వయంశక్తి సంఘాల మహిళలకు సూచనలిస్తున్న ఏపీఎం

రేగిడి: స్వయంశక్తి సంఘాల్లో ఉన్న మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందాలని ఏపీఎం పి.మంగమ్మ సూచించారు. మండలంలోని రేగిడి, ఆమదాలవలస, అప్పాపురం తదితర గ్రామాల్లో స్వయంశక్తి సంఘాల మహిళలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం స్వయంశక్తి సంఘాల ఆర్థిక పరిపుష్టితకు చేయూతనిస్తోందన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో చిరువ్యాపారాలు పెట్టుకొని ప్రతి ఒక్కరూ ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని సూచించారు. స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: గ్రామాల్లో సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందాలు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను పది బృందాలతో తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీలు మాధవరావు, అచ్యుతరావు, ఏపీఓ సంగంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు చినభీమవరంలో గడప గడపకు..

బాడంగి: మండలంలోని చినభీమవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ మరిపి శంకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని ఆయన కోరారు.

నలభై ఏళ్లు గుర్తుంచుకునేలా నాలుగేళ్ల పాలన

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే శంబంగి, పార్టీ శ్రేణులు

బొబ్బిలి: నలభై ఏళ్లు గుర్తుంచుకునేలా వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలన ఉందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ప్రశంసించారు. పార్టీ అధికారంలోకి వచ్చి, నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీది జనరంజక పాలన అని, అన్ని వర్గాలకు అన్ని విధాలా సమన్యాయం చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఆయన పాలన కొనసాగిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. పాదయాత్ర మొదలుకుని, ప్రజాసంకల్పయాత్ర వరకు ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను సీఎం జగన్ నెరవేర్చారని, ఎన్నికల మేనిఫెస్టోలోని 98 శాతం హామీలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఆయనేనన్నారు. 2014లో టీడీపీ 650 హామీలు ఇచ్చిందని, అందులో కనీసం ఆరు కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఉచిత పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక, సోమాలియా, ఉక్రెయిన్ అవుతుందన్న చంద్రబాబే మళ్లీ ఇప్పుడు అవే ఉచిత పథకాలతో మేనిఫెస్టో రూపొందించి, విడుదల చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. మరోసారి చంద్రబాబు చేసే మోసానికి బలి కావడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. జనమంతా జగనన్న వైపే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయమన్నారు.

బైక్ ర్యాలీ..

అమరావతిలోని పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు నేతృత్వంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలంటే చంద్రబాబుకు ఎందుకంత కడుపుమంట అని, ఆయన ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు బాగుపడితే చంద్రబాబు చూడలేరని, ఎప్పుడూ తనవారే బాగుండాలనే ఆలోచన ఆయనదని విమర్శించారు. ప్రతీ పేదవాడు సొంతింట్లో సంతోషంగా ఉండాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని, అందుకే ఆయన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తున్నారన్నారు. అమరావతిలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన సెంటు స్థలంను సమాధిగా చంద్రబాబు పోల్చడం సరికాదన్నారు. రోజురోజుకూ ఆయన మతిభ్రమిస్తోందన్నారు. ఎక్కడ ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రజలే ఆయనను ఛీదరించుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి శాశ్వత సమాధి ప్రజలు కడతారన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఆస్పత్రి రోడ్డు, వేణుగోపాలస్వామి ఆలయం రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. అనంతరం అక్కడి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో బొబ్బిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి: స్థానిక పట్టణంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు జెండా ఆవిష్కరించి, ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సాధించిన విజయాలు వివరించారు. నిత్యం కార్మికుల పక్షాన పోరాడే సీఐటీయూకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

'మిషన్ లైఫ్'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ లైఫ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం మిషన్ లైఫ్ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీల్లో ఈ నెల 18 నుంచి జూన్ 5వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేస్తోందన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను తనిఖీ చేయడంతో పాటు ప్రతిరోజూ ప్రజల ఆరోగ్యానికి సంబంధించి, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జూన్ 1వ తేదీన ప్లాస్టిక్ నిషేధంపై 2వ తేదీన నీటిఆదాపై అవగాహనతో పాటు 3వ తేదీన గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం, 5వ తేదీన చెరువులు, కోనేరులను శుభ్రం చేసి, గట్లపై మొక్కలు నాటాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఈఓపీఆర్‌డీ ఆర్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ చెరువుల పరిశీలన



కంచరాంలో అమృత్ సరోవర్ వర్క్‌బోర్డు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: మండలంలో కంచరాం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్న అమృత్ సరోవర్ చెరువులను జిల్లా సోషల్ టీం మంగళవారం పరిశీలించింది. అధికారులు కె.రాజేష్, కె.చంద్రరావు, సురేష్‌కుమార్ చెరువు వద్దకు చేరుకుని పనుల నాణ్యతను పరిశీలించారు. ఎన్ని రోజులు పనులు చేపట్టారు, వేతనాల చెల్లింపు, చెరువు చుట్టూ ప్లాంటేషన్, రిటర్నింగ్ వాల్స్ నిర్మాణాలపై ఆరా తీశారు. వర్క్ బోర్డులు పరిశీలించి, నివేదికలు రూపొందించారు. త్వరలో కేంద్రం బృందం చెరువుల పరిశీలనకు రానుందని తెలిపారు.

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటలోని అమృత్ సరోవర్ ట్యాంక్ (నీల్ల కోనేరు)ను రాజాం డిప్యూటీ ఈఈ కె.రాజేష్, రాజాం అగ్రికల్చర్ ఏడీ కె.చంద్రరావు, డీఆర్‌పీ ఎ.సురేష్‌లతో కూడిన బృందం మంగళవారం తనిఖీ చేసింది. పనులు చేపట్టిన తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చెరువు గట్టుపై కూర్చొనే విధంగా బల్లలు ఏర్పాటు చేయాలని ఉపాధి ఏపీఓ త్రినాథ్‌కు సూచించారు.

'నాడు-నేడు' పనులు వేగవంతం చేయాలి

రాజాం: మండలంలో 'నాడు-నేడు' కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. రెండో విడతలో చేపట్టిన పనుల పురోగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ ప్రభాకర్, ఎంఈఓ పొంద్రంకి నాగయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు

- డీఎస్పీ శ్రీధర్



సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ తిరుమలరావుతో కలిసి మండల కేంద్రంలోని జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కనే ఉన్న దుకాణాదారులు, వాహనదారులతో మంగళవారం సమావేశమైన ఆయన గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా బొబ్బిలి వైపు వెళ్లే రహదారి చివరి వరకు రోడ్డు కొంతమేర ఆక్రమణకు గురికావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఆ ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడతామన్నారు. ఆక్రమణల కారణంగానే రోడ్డు ఇరుకుగా తయారుకావడం, అంతర్ రాష్ట్ర కూడలి కూడా కావడంతో వాహనాల రద్దీ ఎక్కువై, తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. రోడ్డును ఆనుకుని దుకాణాలు ఉండడం కూడా ట్రాఫిక్ సమస్యకు కారణమన్నారు. రోడ్డుపై వాహనం నిలిపి, వస్తువు కొనుగోలుకు దుకాణానికి వెళ్తే వాహనదారుడు, దుకాణాదారుడిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. దుకాణాల వద్ద వాహనాలు నిలపకుండా వ్యాపారులే బాధ్యతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేంద్రనాయుడు, ఏఎస్‌ఐ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని సతివాడ గ్రామ చెరువు గర్భాల్లోని ఆక్రమణలను మంగళవారం తొలగించారు. ఆక్రమణలపై అందిన ఫిర్యాదు మేరకు ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో వీఆర్‌ఓ అక్కడికి వెళ్లి, జేసీబీతో ఆక్రమణలు తొలగించారు. చెరువు గర్భాలను, గోర్జిలను, సామూహిక ఉపయోగ స్థలాలను ఆక్రమణ చేయడం నేరమని, చెరువు గర్భాలను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నాలుగేళ్ల పాలన అద్వితీయం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో అద్వితీయమైన అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యత ఇస్తూ సుపరిపాలన అందిస్తూ ప్రజాభిమానం పొందారన్నారు. సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో నిలిపడంతో పాటు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దారని అన్నారు. నవరత్న పథకాల ద్వారా నాలుగేళ్లలో కోట్లాది కుటుంబాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. లక్షలాది ఉద్యోగాలు భర్తీచేయడంతో పాటు కోట్లాది మంది విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం చేశారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ల సంఖ్యను పెంచడమే కాకుండా కోవిడ్‌ను సైతం ఆరోగ్యశ్రీలో పెట్టి లక్షలాది మంది ప్రాణాలను కాపాడిన ప్రాణదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దకే వైద్యసేవలు చేరవేశారన్నారు.

రాజాం నియోజకవర్గంలో ప్రధాన రహదారి విస్తరణ, వంగర మండలంలో డబల్ రోడ్డు నిర్మాణం, కిమ్మి-రుషింగి వంతెన నిర్మాణం, సంతకవిటి మండలం వాల్తేరు వద్ద బలసలరేవు వంతెన మంజూరు తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 175 స్థానాల్లో గెలిపించి జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎంను చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జోనల్ కన్వీనర్ కంబాల సందీప్, రాజాం, వంగర మండలాల కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వంజరాపు విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీరంగంనాయుడు, తోట తిరుమలరావు, గణపతి, చల్లా జయరాం, నల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో సంక్షేమ పాలన



రేగిడి: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేగిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయని ఎంపీపీ దార అప్పలనర్సమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం కేక్ కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చల్లని దీవెలనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చక్కని పరిపాలన అందిస్తున్నారన్నారు. 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారని వెల్లడించారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం



భీమవరంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బాడంగి: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని భీమవరం గ్రామంలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని వర్గాలు బాగుండాలన్నదే జగనన్న అభిమతమని, అందుకే అందరికీ మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక, ఉక్రెయిన్, సోమాలియా అయిపోతుందన్న చంద్రబాబే మళ్లీ ఉచిత పథకాలతో మేనిఫెస్టో రూపొందించి, విడుదల చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ఆడిన మాటలకు, చేస్తున్న పనులకు పొంతన ఉండదన్నారు. గతంలో 2014లో ఆ పార్టీ ఇచ్చిన 650 హామీల్లో కనీసం ఆరు కూడా నెరవేర్చలేదనే ప్రజలు ఆ పార్టీని పక్కన బెట్టారని ఎద్దేవాచేశారు. పైగా ఆయన విడుదల చేసిన మేనిఫెస్టోలోని హామీలన్నీ కర్ణాటక, తమిళనాడుతో పాటు మన రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న పథకాలనే పేర్లు మార్చి, కాపీ..కట్.. పేస్ట్ చేశారని విమర్శించారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీదే వచ్చే ఎన్నికల్లోనూ విజయమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పి.రామారావు, ఎంపీటీసీ వి.దివ్య, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి, ఏఈలు ప్రవీణ్‌కుమార్, రమేష్, శ్రీనివాసరావు, ఏపీఎం భాగ్యలక్ష్మి, ఏపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పేదవానికి ఆర్థిక చేయూత

- ఎమ్మెల్యే కంబాల జోగులు



ఆదర్శనగర్‌లో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ప్రతీ పేదవానికి ఈ ప్రభుత్వం హయంలో సంక్షేమ పథకాలు అందాయని, ప్రతీ పేద కుటుంబం ఆర్థికంగా బలోపేతం అయిందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఈ నాలుగేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం టీడీపీ ప్రభుత్వంలో ఎన్నడూ జరగలేదన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్, అమ్మవారికాలనీలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. నవరత్న పథకాలతో ప్రతీ కుంటుంబం ఆనందంగా జీవిస్తోందన్నారు. ఎన్నికలు సమీపించడంతో టీడీపీ నేతలు కల్లబొల్లి కబుర్లతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, టీడీపీ పొరపాటున అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ కనుమరుగవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంజరాపు విజయ్‌కుమార్, వెంపల లక్ష్మణరావు, జేసీబీ శ్రీను, ఆర్నిపల్లి వెంకటనాయుడు, ఓలేటి గణపతి, రేజేటి జయరాం, చప్పటి పెంటయ్య, శ్రీహరినాయుడు, ఎస్.నాగేశ్వరరావు, సతీష్, చిన్న, సోరాడ సూరి, పట్టుశాలి కార్పొరేషన్ డైరెక్టర్ బొల్లా లలితకుమారి, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఏఈ రత్నాకర్, సూపర్‌వైజర్ శ్రీధర్, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు సత్కారం

రాజాం నియోజకవర్గంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధాన కర్తలుగా గుర్తింపు పొందిన వలంటీర్లు మరింత మెరుగ్గా సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్, రాజాం



సంతకవిటి: హొంజరాంలో వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్ ఎస్.కృష్ణవేణి, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి



వంగర: మగ్గూరులో వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్ పి.రమేష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు



రాజాం: గురవాంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీడీఓ బాసూరి శంకరరావు,



రేగిడి: సంకిలిలో వలంటీర్లను సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు, ఎంపీటీసీ శ్రీనివాసరావు, తదితరులు

సంక్షిప్తంగా...

రైతు భరోసా నిధుల విడుదల రేపు

బొబ్బిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రైతు భరోసా పథకం నిధుల విడుదల కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందరరావు మంగళవారం తెలిపారు. ఏటా ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 30వ తేదీన జరగాల్సిన ఈ కార్యక్రమం 1వ తేదీకి వాయిదా పడిందని, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని పేర్కొన్నారు.

చెరువు పనుల నాణ్యత పరిశీలన

బొబ్బిలి: అమృత్ సరోవర్ పథకం కింద మండలంలోని పక్కి, శివడవలస, రంగరాయపురం గ్రామాల్లో చేపట్టిన చెరువు అభివృద్ధి పనుల నాణ్యతను గజపతినగరం ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాసరావు, డీఆర్‌పీ తిరుమలరావు కలిసి మంగళవారం పరిశీలించారు. గట్టుపై నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ముగిసిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు

బాడంగి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 24వ తేదీన ప్రారంభమైన పరీక్షలు ఆరు రోజుల పాటు రెండు పూటలా జరిగాయని పరీక్ష కేంద్రం చీఫ్ వి.శంకరరావు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా జరిగాయని, మాస్ కాపీయింగ్ జరగలేదని, ఇంతవరకు ఏ ఒక్కరూ డిబార్ కాలేదని తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రాజాం సిటీ: స్థానిక తెలగవీధి సత్యనారాయణపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు బట్టరు శ్రీనివాసాచార్యులు తెలిపారు. తొలిరోజు ఉత్సవ సంకల్పం, అంకురారోహణ, మండపారాధన, అగ్నిప్రతిష్ట, తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.